
సాక్షి చిత్తూరు

ఆదివారం । 2 । జూన్ । 2024



పవిత్రం.. ప్రీతికరం

కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో వివిధ రకాలను నైవేద్యాలను నివేదిస్తున్నారు. - 8లో



తల్లిని చూసేందుకు వెళుతూ..

అనారోగ్యంతో ఉన్న తల్లిని చూసేందుకు బైక్‌పై వెళుతూ ఓ తండ్రీకొడుకూ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. - 8లో



అధికారం మాదే..

బైరెడ్డిపల్లె మండలంలో టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. ప్రజలపై యథేచ్ఛగా దౌర్జన్యాలకు దిగుతున్నారు. - 8లో

న్యూస్‌రీల్

కౌంటింగ్‌లో తప్పు జరిగితే చర్యలు

చిత్తూరు కలెక్టరేట్ : కౌంటింగ్ ప్రక్రియలో తప్పు జరిగితే చర్యలు తీవ్రంగా ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ స్పష్టం చేశారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీన ఓట్ల లెక్కింపును పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈటీబీఎస్(సర్వీసు) ఓట్ల కౌంటింగ్‌పై సిబ్బందికి శిక్షణ ఇచ్చామని వెల్లడించారు. నిర్దేశించిన సమయానికి సిబ్బంది, ఏజెంట్లు కచ్చితంగా కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని ఆదేశించారు. గుర్తింపు కార్డు తప్పనిసరిగా ధరించాలన్నారు. సెల్‌ఫోన్‌లను తీసుకురాకూడదని తెలిపారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ జరుగుతుందని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు అదనపు రిటర్నింగ్ అధికారులను నియమించామన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పటిష్ట బందోబస్తు కల్పించినట్లు వెల్లడించారు.

తెలుగు రచయితల సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా సుబ్రమణ్యంరెడ్డి



చిత్తూరు రూరల్ (కాణిపాకం): భారతీయ తెలుగు రచయితల సమాఖ్య అధ్యక్షుడిగా సుబ్రమణ్యంరెడ్డిని ఎన్నుకున్నట్లు జాతీయ అధ్యక్షుడు నారాయణస్వామి, గౌరవ అధ్యక్షుడుమద్రిపూడి దేవేంద్రరావు శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యంరెడ్డి మాట్లాడుతూ తెలుగు భాష పరిరక్షణకు అంకితభావంతో తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

రేపటి నుంచి మద్యం విక్రయాలు బంద్

చిత్తూరు అర్బన్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో మద్యం విక్రయాలపై అధికారులు ఆంక్షలు విధించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 3, 4, 5వ తేదీల్లో జిల్లా వ్యాప్తంగా వైన్‌షాపులు, బార్లను మూసివేయనున్నట్లు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ జిల్లా అధికారి ఆయేషాబేగం తెలిపారు. ఎక్కడా మద్యం విక్రయాలు జరగవని పేర్కొన్నారు. మరోవైపు ఎగ్జిట్ పోల్స్ నేపథ్యంలో శనివారం కూడా జిల్లాలో మద్యం దుకాణాలు బంద్ మూసేశారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో 'పికెట్'



మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: సార్వత్రిక ఫలితాల వెల్లడి తర్వాత ఎక్కడా అల్లర్లు, గొడవలు జరగకుండా సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ పికెట్ 24 గంటల పాటు నిర్వహించాలని ఎస్పీ మణికంఠ ఆదేశించారు. శనివారం చిత్తూరులోని పోలీసు అతిథిగృహంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలతో సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాల్లో బందోబస్తు పెంచాలన్నారు. రౌడీ షీటర్లు, సమస్యలు సృష్టించే వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలని సూచించారు. ముఖ్య నాయకుల ఇళ్లు, పార్టీ కార్యాలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, 24 గంటల పాటు పోలీసు నిఘా ఉండేలా చూడాలని చెప్పారు. శాంతిభద్రతల రక్షణకు ముందస్తు చర్యల్లో భాగంగా రబ్బర్ బుల్లెట్లు, టియర్ గ్యాస్, ఇతర పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు.ఎక్కడా సామాన్యులకు ఇబ్బంది కలగకూడదని కోరారు. సమావేశంలో ఏఎస్పీ ఆరీఫుల్లా పాల్గొన్నారు.

హనుమా.. కనుమా!



బాలాంజనేయునికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

తిరుమలలో హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. జాపాలి తీర్థంలో శ్రీరామ భక్తునికి విశేష పూజలు జరిపించారు. పంచామృతాలతో స్నపన తిరుమంజనం చేపట్టారు. పవిత్ర ఆకాశగంగ వద్ద అంజనాదేవి సన్నిధిలో కొలువైన బాలాంజనేయుని దర్శించుకుని భక్తజనం పులకించారు. ఇరుముడులు సమర్పించి తరించారు. మాల్‌పూరి ప్రసాదం స్వీకరించి పునీతులయ్యారు. శ్రీవారి తరఫున ఈఓ ధర్మారెడ్డి చేతులమీదుగా శేష వస్త్రాలను అందజేశారు. ఆనంద నిలయం ఎదుట విలసిల్లుతున్న బేడీ ఆంజనేయస్వామికి ప్రత్యేక అభిషేకం చేపట్టారు.

– తిరుమల



ఆకాశగంగలో ఆంజనేయస్వామికి శ్రీవారి తరఫున శేషవస్త్రాలు తీసుకువస్తున్న ఈఓ ధర్మారెడ్డి



జాపాలిలో విశేష పూజలందుకుంటున్న స్వామివారు



ఇరుముడితో స్వామి దర్శనానికి వస్తున్న భక్తులు

తొలి ఫలితం చిత్తూరుదే!

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. పకడ్బందీగా ఓట్ల లెక్కింపునకు సన్నద్ధమవుతున్నారు. పోస్టల్ బ్యాలెట్లు.. ఈవీఎంలలో నిక్షిప్తమైన ప్రజల తీర్పు గణనకు పక్కాగా ప్రణాళిక రూపొందించారు. ఈ క్రమంలో ముందుగా చిత్తూరు ఫలితం తేలుతుందని అధికారులు వెల్లడిస్తున్నారు. మధ్యాహ్నానికి దాదాపు అన్ని నియోజకవర్గాల రిజల్ట్స్ విడుదలవుతాయని వివరిస్తున్నారు. ప్రతి సెగ్మెంట్‌లో పోలైన ఓట్లు.. అభ్యర్థుల సంఖ్య మేరకు కౌంటింగ్ రౌండ్లు నిర్ణయించినట్లు చెబుతున్నారు.



కౌంటింగ్ కేంద్రం పరిశీలనలో జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్

యాప్‌లో అప్‌లోడ్ చేసి..

ఈ పర్యాయం ఫలితాలు వెల్లడించడానికి ముందే అభ్యర్థులకు వచ్చిన ఓట్లను కేంద్ర ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన సువిధ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. పోలింగ్ స్టేషన్ క్రమ సంఖ్య ఆధారంగా ఈవీఎంలను 14 టేబుళ్లలో ఉంచి ఫలితాలను లెక్కించనున్నారు. ఎలాంటి గందరగోళం లేకుండా అందరి అనుమతితోనే సువిధ యాప్‌లో వీటిని అప్‌లోడ్ చేసి, ఆపై ఫలితాలను ప్రకటించనున్నారు. మొత్తం అన్ని నియోజకవర్గాల ఫలితాలు మధ్యాహ్నం రెండు గంటలకల్లా వెలువడే అవకాశం ఉంది.

- చివరన పలమనేరులో ప్రజా తీర్పు వెల్లడి
- 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్
- ముందుగా పోస్టల్ బ్యాలెట్లు.. తర్వాతే ఈవీఎం ఓట్ల లెక్కింపు
- కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేసిన అధికారులు
- మధ్యాహ్నం 2 గంటలకు దాదాపు అన్ని ఫలితాలు



చిత్తూరు కౌంటింగ్ కేంద్రం వద్ద భద్రత పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ

జిల్లా సమాచారం

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పోలైన ఓట్లు	లెక్కింపు రౌండ్లు
చిత్తూరు	226	1,64,788	17
నగరి	229	1,76,399	17
కుప్పం	243	2,02,920	18
జీడీ.నెల్లూరు	255	1,81,779	19
పుంగనూరు	262	2,06,916	19
పూతలపట్టు	260	1,93,730	19
పలమనేరు	287	2,35,476	21

చిత్తూరు అర్బన్ : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియపై జిల్లా అధికారులు సన్నాహాలు పూర్తి చేశారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా పోలైన ఓట్లను లెక్కించనున్నారు. ప్రతి 50 పోస్టల్ బ్యాలెట్లను ఓ కట్టగా.. పార్లమెంటు, అసెంబ్లీ స్థానాల ఆధారంగా వేరు చేస్తారు. ఇలా కట్ట కట్టిన పోస్టల్‌బ్యాలెట్లను లెక్కించడం పూర్తయ్యాక ఫలితాలను వెల్లడిస్తారు. ఆపై ఈవీఎంలలో పోలైన ఓట్లను లెక్కించి సంపూర్ణ ఫలితాలు ప్రకటిస్తారు.

కట్టుదిట్టంగా భద్రత..

ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద మునుపెన్నడూ లేనివిధంగా ఈసారి అత్యంత కట్టుదిట్టంగా భద్రత ఏర్పాటు చేశారు. చిత్తూరులోని ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్ర ప్రాంతాన్ని ఇప్పటికే నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించారు. ఇక్కడ డ్రోన్ లాంటివి ఎగురవేయడాన్ని నిషేధించారు. అలాగే కౌంటింగ్ రోజున అభ్యర్థులు, అధికారులు ధ్రువీకరించిన ఏజెంట్లకు మాత్రమే కేంద్రంలోకి అనుమతి ఉంది. ఈ రెండు ప్రాంతాల్లో వాహనాల రాకపోకలను సైతం మళ్లించారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఎవరిని పడితే వాళ్లను పంపించే ప్రసక్తే ఉండదు. ఒక్కసారి లోపలకు వెళ్లిన వ్యక్తి.. తుది ఫలితాలు పూర్తయ్యాకే బయటకు రావాల్సి ఉంటుంది. ఎస్పీ నుంచి ఏఎస్పీ, డీఎస్పీ, సీఐలతో దాదాపు 300 మందిని పోలీసులను నియమించారు. అలాగే కేంద్ర సాయుధ దళాలు సైతం బందోబస్తు నిర్వహిస్తాయి.

పోలైన ఓట్ల ఆధారంగా..

మరోవైపు ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్లను లెక్కించడానికి పోలింగ్ కేంద్రాలు, పోలైన ఓటర్ల సంఖ్య ఆధారంగా ఫలితాలు వెలువడనున్నాయి. జిల్లాలో చిత్తూరు నియోజకవర్గంలో అత్యల్పంగా 226 పోలింగ్ కేంద్రాలు, 1,76,339 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో.. ఇక్కడే తొలి ఫలితం రానుంది. దీని తరువాత నగరి, కుప్పంతో ప్రారంభించి.. చివరల్లో పలమనేరు ఫలితాలు రానున్నాయి.

కుప్పంలో గాలివాన బీభత్సం

- విరిగిపడిన చెట్లు
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు



పడిపోయిన చెట్లు

కుప్పంరూరల్ : కుప్పం మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో శనివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. దీంతో భారీ వృక్షాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు నేలకొరిగాయి. సుమారు రెండు గంటలపాటు కొనసాగిన గాలివానకు పలవరిగానిమిట్ట, అడవిబూదుగూరు, శివానందపురం, సింగాపురం, పరమసముద్రం గ్రామాల్లో వందలాది చెట్లు విరిగిపడ్డాయి. పలవరిగానిమిట్ట, పరమసముద్రం, తంబిగానిపల్లెలో 10 విద్యుత్ స్తంభాలు, 4 ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయాయి. టమాట, వంగ, చిక్కుడు పంటలు దెబ్బతిన్నాయి. పొలాల్లో నీరు నిలిచిపోవడంతో మరికొన్ని పంటలు నష్టపోయే అవకాశాలు ఉన్నాయి.



నేల కూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

బాలసుందరంరెడ్డి సేవలు మరువలేం

పలమనేరు : పట్టణానికి చెందిన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, టీడీపీ సీనియర్ నేత బాలసుందరంరెడ్డి రాజకీయంగా అందించిన సేవలు మరువలేమని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కొనియాడారు. శనివారం బాలసుందరంరెడ్డి నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ నిబద్ధతతో రాజకీయాలు చేసిన వారికి ఎన్నటికీ విలువ ఉంటుందన్నారు. బాలసుందరంరెడ్డితో తన కున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కో–కన్వీనర్ కృష్ణమూర్తిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ హేమంత్ కుమార్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, ఎంపీపీ రెడ్డెప్ప, చెంగారెడ్డి, బాలాజీ రెడ్డి పాల్గొన్నారు.



బాలసుందరంరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

50.21 శాతం పింఛన్ల పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా శనివారం 50.21 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ అధికారులు వెల్లడించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్నికల నిబంధనలు పాటిస్తూ జిల్లాలో సామాజిక పింఛన్లు అందించారు. బ్యాంక్ ఖాతాలు ఉన్న లబ్ధిదారులకు నేరుగా డీబీటీ విధానంలో, లేని వారికి సచివాలయ సిబ్బంది ద్వారా నగదు అందజేశారు. జిల్లాలో 2,72,223 మందికిగాను 1,36,675 మందికి పింఛన్ పంపిణీ చేశారు. ప్రభుత్వం మొత్తం రూ.79.66 కోట్లు మంజూరు చేయగా, తొలి రోజు రూ.39.46 కోట్లు లబ్ధిదారులకు అందజేసినట్లు అధికారులు వెల్లడించారు.

అక్రమ అడ్మిషన్లపై ఫిర్యాదు

చిత్తూరు కలెక్టరేట్ : అక్రమ అడ్మిషన్లతో ఇంటర్మీడియట్ విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తున్న వివేకానంద (వీఎంకే) కళాశాలపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరారు. శనివారం ఈ మేరకు ఇంటర్మీడియట్ డీవీఈఓ సయ్యద్‌మౌలాకు వినతిపత్రం ఇచ్చారు. మూతపడిన కళాశాల అనుమతిని చూపించి వివేకానంద (వీఎంకే) కళాశాలను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులను చేర్చుకుంటున్నారన్నారు. అధిక సంఖ్యలో విద్యార్థులకు అడ్మిషన్లు ఇస్తున్నారని చెప్పారు. పదోతరగతిలో బాగా మార్కులు వచ్చిన విద్యార్థులను ఒక వైపు, తక్కువ మార్కులు వచ్చిన వారిని మరో కళాశాలలో అడ్మిట్ చేయిస్తున్నారని మండిపడ్డారు. వారి ఆధీనంలో ఉండే మూడు కళాశాలల అనుమతులతో అడ్మిషన్‌లు చేయించి తమను మోసం చేస్తున్నారన్నారు. ఆ కళాశాలపై సమగ్ర విచారణ చేయించి తగు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు సాయి శ్యామ్, ముని, చరణ్, జ్యోతి కోరారు. డీవీఈఓ సయ్యద్ మౌలా స్పందిస్తూ జిల్లా కేంద్రంలో రెండు, మూడు కళాశాల అనుమతులతో నిర్వహిస్తున్న యాజమాన్యంపై ఫిర్యాదు అందిందన్నారు. బోర్డు నిబంధనలను కచ్చితంగా ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాలు పాటించాలని స్పష్టం చేశారు. ఈ ఫిర్యాదులపై ప్రత్యేక కమిటీని వేసి సమగ్ర విచారణ చేయిస్తామని హామీ ఇచ్చారు.



తల్లిదండ్రులు అందించిన వినతిని పరిశీలిస్తున్న డీవీఈఓ సయ్యద్ మౌలా

పకడ్బందీగా ఇంటర్ అడ్మిషన్లు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శనివారం పకడ్బందీగా అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు కళాశాలలకు చేరుకున్నారు. పలు మండలాల్లో విద్యార్థుల ఇంటికి అధ్యాపకులు వెళ్లి అడ్మిషన్‌లు నమోదు చేశారు. గత ఏడాది కంటే ఇప్పుడు అడ్మిషన్ల సంఖ్య పెంచేందుకు చర్యలు చేపట్టామని ఇంటర్మీడియట్ డీవీఈఓ సయ్యద్ మౌలా వెల్లడించారు. 2024–25 విద్యాసంవత్సరం అకడమిక్ క్యాలెండర్ ప్రకారం జూలైలో మొదటి యూనిట్, ఆగస్టులో రెండో యూనిట్ పరీక్షలు, సెప్టెంబర్‌లో క్వార్టర్లీ పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు.



అడ్మిషన్ ఇస్తున్న అధ్యాపకుడు చిట్టిబాబు

క్లుప్తంగా

అధికారం మాదే.. అడ్డొస్తే తగలేస్తాం

– టీడీపీ నేత ఆగడం

బైరెడ్డిపల్లె : మండలంలో టీడీపీ నేతలు చెలరేగి పోతున్నారు. అధికారం మాదే.. అడ్డుస్తే తగలేస్తాం అంటూ దాదాగిరి చేస్తున్నారు. శనివారం మండలంలోని మురారిపల్లె నుంచి గాజీపేటకు వెళ్లే రహదారిపై రాకపోకలకు వీలు లేకుండా ఓ టీడీపీ నేత బండరాళ్లు వేయించాడు. గ్రామస్తులు అడ్డుకోవడంతో వారిని దూషించాడు. గ్రామ పెద్దలు నచ్చజెప్పేందుకు యత్నించినా పట్టించుకోలేదు. దీంతో గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చేరుకున్న పోలీసులు సదరు టీడీపీ నేతతో చర్చించి రాళ్లను తొలగించారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్



నిందితురాలి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్ : నగరంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న పి.జ్యోతి (45) అనే మహిళను పోలీసులు అరెస్టు చేశారు. శనివారం టూటౌన్ సీఐ ఉలసయ్య మీడియాకు వివరాలు వెల్లడించారు. సంతపేట సమీపంలోని రంగాచారివీధిలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. టూటౌన్ ఎస్ఐ ప్రసాద్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. జ్యోతి అనే మహిళను అరెస్టు చేసి, రూ.40 వేలు విలువైన 576 మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఇదే వీధికి చెందిన అత్తోరం రాజా పరారయ్యాడు. అతడిపై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ఉదయ్‌కుమార్ మృతదేహం

గంగాధర నెల్లూరు: మండలంలోని సుందరరాజపురం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. గంగాధర నెల్లూరు మండలం వేపంజేరి పంచాయతీ సర్విరెడ్డిపల్లెకు ఉదయ్ కుమార్ రెడ్డి (26) జూనియర్ లైన్‌మన్‌గా తాళంబేడు సచివాలయంలో పనిచేస్తున్నాడు. చిత్తూరులోని మైదా ఫ్యాక్టరీ సమీపంలో నివసిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి తాళంబేడులో కరెంటు పోయిందని గ్రామస్తులు ఫోన్ చేయడంతో గ్రామానికి వెళ్లాడు. మరమ్మతులు పూర్తి చేసి తిరుగు ప్రయాణంలో ఉండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్ తెలిపారు.

పవిత్రం.. ప్రీతికరం

కాణిపాకం క్షేత్రంలో స్వయంభు శ్రీవరసిద్ధ వినాయకస్వామికి దేవస్థానం పలురకాల నైవేద్యాలను నివేదిస్తోంది. వీటిలో లడ్డూ ప్రసాదానికి భక్తకోటి నుంచి విశేష ఆదరణ ఉంది. అలాగే పులిహోర.. వడ తదితరాలు సైతం భక్తులకు మరింత ప్రీతికరంగా మారాయి. ఆయా ప్రసాదాల్లో ఎన్నో ప్రత్యేకలున్నాయి. దేశం నలుమూలల నుంచి తరలివచ్చే యాత్రికులు గణనాథుని ప్రసాదాలను అపురూపంగా భావిస్తారు. ఈ క్రమంలో దేవస్థానం వారు ప్రసాదాలను నాణ్యతగా తయారు చేయిస్తున్నారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా సామాన్యులకు సైతం అందుబాటు ధరలకే అందిస్తున్నారు.

- కాణిపాకం ప్రసాదాలకు విశేష ఆదరణ
- లడ్డూ, వడ, పులిహోరకు భక్తులు క్యూ
- నాణ్యతతో పాటు లాభపేక్ష లేకుండా విక్రయాలు
- అద్భుతంగా.. రుచికరంగా ఉన్నాయంటున్న భక్తులు



కాణిపాకంలోని వరసిద్ధి వినాయకస్వామి ప్రసాద విక్రయ కేంద్రం





కాణిపాకం : కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ప్రసాదమంటే భక్తులకు అమితమైన ప్రీతి. ఆలయం పేరు చెప్పగానే టక్కుమని గుర్తుకొచ్చేది లడ్డూ ప్రసాదం. ఇది ఒకప్పటి మాట. ఇప్పుడు మూడు రకాల ప్రసాదాలు గుర్తుకొస్తున్నాయి. లడ్డూ, పులిహోర, వడ, భక్తులకు మరింత ప్రీతికరంగా మారాయి. స్వామి దర్శనార్థం వచ్చే భక్తజనం స్వామి ప్రసాదంను అపురూపంగా భావిస్తారు. ఆలయాన్ని నిత్యం వేలాది మంది భక్తులు సందర్శిస్తున్నారు. శని, ఆదివారాల్లో 30 వేలకు పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకుంటున్నారు. దర్శనం పూర్తవగానే భక్తులు ప్రసాదం కోసం ఆసక్తి చూపుతుంటారు. ఇక్కడ మూడు రకాల ప్రసాదాలు భక్తులకు లభిస్తున్నాయి.

లడ్డూ తయారీ ఇలా..

కాణిపాకంలో లడ్డూను నాణ్యతగా తయారు చేస్తున్నారు. లాభాపేక్ష లేకుండా భక్తులు సంతృప్తి చెందేలా చూస్తున్నారు. ఈ లడ్డూ తయారీకి శెనగపిండి, చక్కెర, ఆవు నెయ్యి, జీడిపప్పు, ద్రాక్ష, యాలకలు, పచ్చకర్పూరం, జాజికాయ వంటి వాటిని ఉపయోగిస్తున్నారు. 80 గ్రాములు, 400 గ్రాముల బరువులతో రెండు రకాల పరిమాణాలతో లడ్డూలను తయారు చేస్తున్నారు. ఉగ్రాణం నుంచి ప్రతి బ్యాచ్‌కు 1,290 చిన్న లడ్డూలు, 100పైగా పెద్ద లడ్డూలు తయారు చేసి విక్రయాల కౌంటర్‌కు పంపుతున్నారు. దీంతో పాటు 35 గ్రాములు వడ, 150 గ్రాముల పులిహోరను మహా ప్రసాదంగా భక్తులకు అందజేస్తున్నారు. ప్రతిరోజు 10వేలకు పైగా చిన్న లడ్డూ, 1000 పెద్ద లడ్డూ, 575 ప్యాకెట్ల పులిహోర, 1250 వరకు వడలు తయారు చేస్తున్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు.

ప్రసాదం వ్యయం...

80 గ్రాముల పరిమాణం లడ్డూ తయారీకి రూ.14.46 వ్యయం అవుతుండగా..రూ.15లకు అమ్ముతున్నారు. 400 గ్రాముల పరిమాణం లడ్డూకు రూ. 66.68 ఖర్చు అవుతుండగా రూ.75కు విక్రయిస్తున్నారు. 35 గ్రాముల వడ తయారీకి రూ.9.22కు ఖర్చు అవుతుండగా రూ.10కి అమ్ముతున్నారు. 150 గ్రాముల పులిహోరా తయారీకి రూ.9.07 వ్యయం అవుతుండగా రూ.10లకే భక్తులకు అందిస్తున్నారు. ఇందులో ఎలాంటి లాభపేక్ష లేకుండా రుచికరంగా, నాణ్యతగా ప్రసాదాలను తయారు చేస్తున్నారు.

క్యూకడుతున్న భక్తులు...

ఆలయం తెరిచినప్పటి నుంచి రాత్రి 9గంటల వరకు లడ్డూలను విక్రయిస్తున్నారు. పులిహోర ఉదయం 6 నుంచి ఉదయం 10 గంటల వరకు, వడ ఉదయం 6 నుంచి 11 గంటల వరకు కౌంటర్‌లో భక్తులకు అందిస్తున్నారు. దీంతో పాటు దర్శనంతరం ఉచిత ప్రసాదం కూడా ఇస్తుంటారు. ఇందు కోసం ఉదయం నుంచి కూడా భక్తజనం అధిక సంఖ్యలో క్యూలో వేచి ఉంటారు. ఉచిత ప్రసాదం పాటు ప్రసాద విక్రయ కౌంటర్ వద్ద కూడా క్యూడుతుంటారు. దీంతో మహా ప్రసాదంకు భలే గిరాకీ ఏర్పడింది.

ఎంతో ఇష్టం



ఏటా ఆలయ దర్శనానికి వస్తుంటాను. ఇక్కడ పవిత్రమైన స్వామి ప్రసాదం రుచి చూడకుండా వెళ్లం. మాకు పులిహోర, లడ్డూలంటే భలే ఇష్టం. కుటుంబ సభ్యులకు, బంధువులకు తీసుకెళుతుంటాం. లడ్డూ, పులిహోర, వడ రుచికరంగా ఉన్నాయి. కౌంటర్ వద్ద కూడా ఇబ్బంది లేకుండా ప్రసాదం అందిస్తున్నారు.

–ఈశ్వర్, భక్తుడు, కర్నూలు

నాణత్యగా ఇస్తున్నారు..



నేనే కూడా కర్నూలు నుంచే వచ్చాను. ప్రతిసారి కుటుంబ సభ్యులు, స్నేహితులతో పాటు వస్తుంటాను. దర్శనం పూర్తయిన తర్వాత ప్రసాదం తీసుకుంటాను. ఇక్కడ ప్రసాదమంటే మా కుటుంబ సభ్యులకు చాలా ఇష్టం. ఇక్కడ లడ్డూలు నాణ్యత ఉంటాయి. పులిహోర, వడ కూడా రుచికరంగా ఉన్నాయి. మేమైతే అత్యంత ప్రీతికరంగా భావిస్తాం.

–రఘు, భక్తుడు, కర్నూలు

తల్లిని చూసేందుకు బైక్‌లో వెళ్తూ..



ప్రమాదంలో మృతి చెందిన హర్షిత్ రెడ్డి



తీవ్రంగా గాయపడిన శరత్‌కుమార్ రెడ్డి

నాయుడుపేట టౌన్: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తల్లిని చూసేందుకు తన తండ్రితో కలిసి కుమారుడు బైక్‌లో బయలుదేరాడు. ఇంతలో మృత్యువు లారీ రూపంలో దూసుకొచ్చింది. బైక్‌ను ఢీకొట్టడంతో బీటెక్ చదువుతున్న విద్యార్థి అక్కడికక్కడే మృతిచెందగా.. మృతుడి తండ్రికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని పండ్లూరు గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. కోట మండలం, వంజివాక గ్రామానికి చెందిన కాపులూరు శరత్‌కుమార్‌రెడ్డి ప్రయివేటు సంస్థలో ఉద్యోగి. 15 ఏళ్ల నుంచి సూళ్లూరుపేట పట్టణంలోని సాయినగర్‌లో నివాసం ఉంటున్నాడు. భార్య పవిత్ర, కుమారుడు హర్షిత్‌రెడ్డి(21), కుమార్తె సాయి అక్షయ ఉన్నారు. కుమారుడు హర్షిత్‌రెడ్డి విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ కళాశాలలో బీటెక్ చదువుతుండగా.. కుమార్తె ఇంటర్ చదువుతోంది. తన భార్య పవిత్రకు ఇటీవల అనారోగ్యం కారణంగా గూడూరు వైద్యశాలలో శస్త్ర చికిత్స చేయడంతో ఆమె అక్కడే ఆస్పత్రిలో ఉంటోంది. ఆమెను చూసేందుకు కుమారుడు హర్షిత్‌రెడ్డితో కలిసి శరత్‌కుమార్‌రెడ్డి బైక్‌లో సూళ్లూరుపేట నుంచి బయలు దేరారు. మార్గమధ్యంలో పండ్లూరు గ్రామ జాతీయ రహదారి వద్ద వెనుక నుంచి వస్తున్న లారీ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న కుమారుడు హర్షిత్‌రెడ్డి, వెనుక కూర్చొని ఉన్న తండ్రి శరత్‌కుమార్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ గోపి తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన తండ్రి, కుమారుడిని హైవే అంబులెన్స్‌లో నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే మార్గ మధ్యంలోనే కుమారుడు హర్షిత్‌రెడ్డి మృత్యువాత పడ్డాడు. తండ్రి శరత్‌కుమార్‌రెడ్డిని మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. హర్షిత్‌రెడ్డి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మిన్నంటిన రోదనలు

ప్రభుత్వ వైద్యశాల వద్దకు మృతుడి కుటుంబ సభ్యులతో పాటు బంధువులు, స్నేహితులు చేరుకుని మార్చురీ గదిలో నిర్జీవంగా పడి ఉన్న హర్షిత్‌రెడ్డిని చూసి గుండెలవిసేలా రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. కళాశాల విద్యార్థులు వైద్యశాల వద్దకు చెరుకుని కన్నీటి పర్యంతమయ్యారు.

ఘనంగా 'రావూరి' జన్మదినోత్సవం



రావూరి వెంకటస్వామికి శుభాకాంక్షలు తెలుపుతున్న విజయానందరెడ్డి



రావూరి వెంకటస్వామిని సత్కరిస్తున్న అధ్యాపకులు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగంలో డాక్టర్ రావూరి వెంకటస్వామి విజయ పతాకం ఎగురవేశారని వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి కొనియాడారు. శనివారం చిత్తూరు సమీపంలోని ఆర్‌వీఎస్ నగర్‌లో రావూరి వెంకటస్వామి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విజయానందరెడ్డి మాట్లాడుతూ రావూరి వెంకటస్వామి వేలాది మంది విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ అందించారన్నారు. ఎంతో మంది నిరుద్యోగులకు జీవనోపాధి కల్పించారని వెల్లడించారు. ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ వి.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం తన తండ్రి ఎస్వీ సెట్ విద్యాసంస్థలను నెలకొల్పారని తెలిపారు. ఇంజినీరింగ్, మెడికల్, లా కళాశాలలను ఏర్పాటు చేసిన వేలాది మంది విద్యార్థుల ఉన్నతికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఎస్వీపీ సెట్ వైస్ చైర్మన్ రావూరి బాలాజీ, ప్రిన్సిపల్ సునీల్‌కుమార్‌రెడ్డి, ఎస్వీ సెట్ ప్రిన్సిపల్ మోహన్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ లోకనాథరెడ్డి పాల్గొన్నారు.

చోరీ చేసిన గంటకే పట్టుబడిన దొంగ



లోకేష్‌ను కర్రతో కొడుతున్న అతడి తల్లి

పలమనేరు : అదే వీధిలో ఉంటూ ఏ ఇంటి తాళం ఎక్కడ పెడతారో తెలుసుకుని మరీ చోరీలకు పాల్పడే ఓ దొంగకు స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన సంఘటన శనివారం పలమనేరులో జరిగింది. వివరాలు.. గాంధీనగర్‌కు చెందిన లోకేష్(17) ఆకతాయిగా తిరుగుతూ, జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడేవాడు. ఈ నేపథ్యంలో అదే వీధికి చెందిన నిర్మలమ్మ వద్దకు శనివారం వెళ్లి మీ పశువులు వేరే వాళ్ల పొలాల్లో మేస్తున్నాయని చెప్పాడు. దీంతో ఆమె ఇంటికి తాళం వేసి తాళం చెవులను ఓ డబ్బాకింద పెట్టి పరుగెత్తుకుంటూ వెళ్లిపోయింది. ఆమె అటు వెళ్లగానే తాళం చెవులను తీసుకున్న లోకేష్ ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని లాకర్‌బాక్స్‌ను తీసి అదే ఇంటివెనుక దాచిపెట్టాడు. ఇంటికొచ్చిన నిర్మలమ్మ బీరువా తెరచిఉండడం చూసి అందులో డబ్బు, నగలున్న లాకర్ బాక్స్ చోరీకి గురైనట్టు గుర్తించింది. వెంటనే తన కుమారుడికి ఫోన్ చేసి లోకేష్ ఇంటికి వచ్చాడని వాడే ఈ పని చేసుంటాడని తెలిపింది. దీంతో నిర్మలమ్మ కుమారుడు తన స్నేహితులతో కలసి లోకేష్‌ను పట్టుకుని తీసుకువచ్చాడు. కరెంట్ స్తంభానికి కట్టేసి లోకేష్ తల్లిని పిలిపించాడు. స్థానికులు దేహశుద్ధి చేయడంతో చోరీచేశానని లోకేష్ ఒప్పుకున్నాడు. ఆగ్రహించిన అతడి తల్లి సైతం కర్రతో దండించింది. దీంతో ఇంటి వెనుకే దాచిన లాకర్‌ను లోకేష్ తీసుకువచ్చి అప్పగించాడు. లాకర్‌లో రూ.1.50లక్షల నగదు, రూ.3లక్షల బంగారు ఆభరణాలు, ఏటీఎం కార్డులు సురక్షితంగా ఉన్నట్టు నిర్మలమ్మ తెలిపారు. అనంతరం లోకేష్‌ను పోలీసులకు అప్పగించారు.

బుద్ధిమాంద్యం యువతిపై లైంగికదాడి

నగరి: బుద్ధిమాంద్యం గల యువతిపై ముగ్గురు యువకులు లైంగిక దాడికి పాల్పడిన ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ వెంకటనారాయణ కథనం మేరకు.. నగరి దళితవాడకు చెందిన బుద్ధిమాంద్యం గల ఒక యువతిని మే 26వ తేదీన ముగ్గురు యువకులు తీసుకెళ్లి సామూహికంగా లైంగిక దాడికి పాల్పడ్డారు. ఆ యువతి నొప్పులు పడుతుండడం గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించడంతో అసలు విషయం బయట పడింది. బాధితురాలి ద్వారా విషయం తెలుసుకున్న ఆమె వదిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎస్వీ సంప్రదాయ శిల్ప కళాశాలలో ప్రవేశాలు

తిరుపతి(అలిపిరి): టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీవేంకటేశ్వర సంప్రదాయ ఆలయ శిల్ప కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి గాను సంప్రదాయ కలంకారీ కళలో డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు జూలై 6వ తేదీ వరకు గడువు పెంచినట్లు జేఈఓ గౌతమి తెలిపారు. కళాశాలలో జూలై 6వ తేదీ వరకు దరఖాస్తులు పొందొచ్చని.. పూర్తి చేసిన దరఖాస్తులను అదేరోజు సాయంత్రంలోపు కళాశాలలో సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 4 సంవత్సరాల డిప్లొమా, 2 సంవత్సరాల సర్టిఫికెట్ కోర్సుల్లో చేరదలచిన విద్యార్థులు కోర్సుల విద్యార్హతలు, ఇతర వివరాల కోసం www.tirumala.org వెబ్‌సైట్‌ను గాని.. కళాశాల కార్యాలయ ఫోన్ నం .0877–2264637, 9866997290ను కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని కోరారు.